విద్యార్థులు ఇష్టపడి చదవాలి

రెబ్బెన, మార్చి 22 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సోసైటీ సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లోని సింగరేణి హైస్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, వసతులు, వార్షిక ఫలితాల వివరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికే కాకుండా ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం గోలేటి జీఎం కార్యాలయంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డిని మార్యద పూర్వకంగా కలిసి సన్మానించారు. కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, హెచ్ఎం రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లరెడ్డి, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

15 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

ఆపరేషన్లు చేయించుకున్న అనంతరం బాధితులు

చెన్నూర్ టౌన్, మార్చి 22 : చెన్నూర్ పట్టణంలో బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు వైద్యుడు అభిషేక్ చిందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బండారి లక్ష్మణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో తిప్పలు

కాగజ్‌నగర్, మార్చి 22 : కాగజ్‌నగర్ పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పట్టణ ప్రజలు, వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించడంతో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో సరఫరా స్తంభించింది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి, కొన్నికాలనీలకు పునరుద్ధర చేసినా, పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయలేదు. దీంతో చాలా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరిపీల్చుకున్నారు. సకాలంలో పునరుద్ధరించకపోవడంతో పట్టణంలోని కొందరు వ్యాపారులు సుమారు రూ.3 వేలు వెచ్చించి, అద్దె జనరేటర్‌తో వ్యాపారాలు కొనసాగించుకున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ కమాలాకర్‌ను ఫోన్‌లో సంప్రదిస్తే కనీసం ఫోన్ కూడ ఎత్తడం లేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఏదైనా విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే కనీసం ఒక ప్రకటన కూడా జారీ చేయకపోవడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్, మార్చి 22 : కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధి వయోధికుల సౌకర్యార్థం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ప్రతినిధులు నారాయణ, రామయ్య, నర్సయ్య, మురారి, నాగేశ్వర్‌రావు, రమణయ్య, కోటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోధికుల సౌకర్యార్థం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్ట్

కోటపల్లి/రామకృష్ణాపూర్/మందమర్రి/చెన్నూర్ రూరల్/సీసీసీ నస్పూర్/బెజ్జూర్, మార్చి 22 : విద్య రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్వీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయా చోట్ల విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కోటపల్లి మండలం రాంపూర్‌కు వెళ్లి బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్‌తో పాటు, నాయకులు గుగ్లోత్ బాపు నాయక్, ఆసంపల్లి అనిల్, కొట్టి వెంకటేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే క్యాతనపల్లి మున్సిపాలిటీలోని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, నాయకులు గాజుల చంద్రకిరణ్, గోనే రాజేందర్, దేవి సాయికృష్ణ, కుర్మ దినేష్, కంది క్రాంతిని వారి ఇండ్లలో రామకృష్ణాపూర్ పోలీసులు.., మందమర్రిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఎండీ ముస్తఫా, పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి నవీన్, ఎండీ తాజ్‌ను.., చెన్నూర్ పట్టణంలోని బస్టాండ్‌లో బీఆర్ఎస్వీ నాయకులు నయాబ్, ఎనగందుల ప్రశాంత్, తిరుపతి, సురేశ్, మనోహర్, రేవల్లి రాజును.., సీసీసీ నస్పూర్‌లోని బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు కాటం రాజు, నాయకులు సాజిద్, వంశీని వారి వారి ఇండ్లలో.., బెజ్జూర్ మండలంలో నాయకులు దుర్గం తిరుపతి, తొడ్సెం శంకర్, నికాడి మోహన్, శంషొద్దీన్ బాబును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులతో తమ గొంతు నొక్కలేదని, బీఆర్ఎస్ పార్టీ, దాని అనుబంధ సంఘాలు ప్రజల ప క్షాన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం గంపెడు హామీలు ఇచ్చి, బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేపట్టిందని మండిపడ్డారు.

బెజ్జూర్ : పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ అయిన బీఆర్ఎస్వీ నాయకులు

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో నాయకులు విద్యాసాగర్, బాపు, అనిల్

మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో..

రామకృష్ణాపూర్‌లో..

సోలార్ విద్యుదుత్పత్తితో లాభాలు

మంచిర్యాలటౌన్, మార్చి 22 : పోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేస్తే రైతులకు లాభాలు వస్తాయని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో శనివారం పీఎం కుసుమ్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న జిల్లాలోని 58 మంది రైతులకు అవగాహన కల్పించారు. 0.5 నుంచి 2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకోసం దరఖాస్తులను ఆహ్వానించగా, 58మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను పలు బ్యాంకుల అధికారులు రైతులకు తెలియజేశారు. రెండు మెగావాట్ల సోలార్‌విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటు కోసం రూ.2 కోట్ల మేర రుణం అందించనున్నట్లు తెలిపారు. ఎస్ఈ గంగాధర్, డీఈ, ఏడీలు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తే చర్యలు

దండేపల్లి, మార్చి 22 : గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం వస్తే తమ దృష్టికి తేవాలని ఎస్ఐ తహసినుద్దీన్ అన్నారు. బెహ్రన్‌గూడ గిరిజన గ్రామంలో శనివారం గ్రామ పటేళ్లతో సమావేశమయ్యారు. యువత బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పటేల్ పెంద్రం రాంపటేల్, పెంద్రం శ్రీనివాస్ తదితరులున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రెబ్బెన, మార్చి 22 : మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే సూచించారు. రెబ్బెన మండలం సింగల్‌గూడ గ్రామంలో ఇందిరా మహిళ శక్తి కింద ఏర్పాటు చేసిన చేపల పెంపకం కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆయన సందర్శించారు. మొట్టమొదట ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, అదర్శంగా తీసుకొని జిల్లాలోని మిగిలిన మండలాల్లో కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పుట్ట గొడుగుల పెంపకం కోసం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

కొమురయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, మార్చి 22 : బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు బోయిని కొమురయ్య(65) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. టీబీజీకేఎస్ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించారు. మలి దశ తెలంగాణ ఉద్యమ సమయంలో తనదైన శైలిలో కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మంచిర్యాలలోని ఓ ప్రవేటు దవాఖానలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన భౌతిక కాయం వద్ద బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నివాళులర్పించారు. అప్పటి ఉద్యమకారులు, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, టీవీట్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరామ్‌సింగ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. కొమురయ్యకు ముగ్గురు కుమారులు, భార్య ఉన్నారు. పెద్దకొడుకకు క్రాంతి రామగుండం కమిషనరేట్, రెండో కొడుకు ప్రవీణ్ రూరల్ సీఐ కార్యాలయంలో కానిస్టేబుళ్లుగా, చిన్నకొడుకు సాగర్ సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

కన్నెపల్లి, మార్చి 22 : వెంకటాపూర్ గ్రామానికి చెందిన చదువుల లక్ష్మణ్ మృతికి కారణమైన పార్వతి రాజేశం, అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ వివరాలు వెల్లడించారు. చదువుల లక్ష్మణ్, మమత భార్యాభర్తలు. శుక్రవారం మమతను లక్ష్మణ్ కొడుతున్నాడన్న కోపంతో వచ్చిన మమత తండ్రి పార్వతి రాజేశం, సోదరుడు అనిల్.. లక్ష్మణ్‌పై చెప్పుతో దాడిచేశారు. అనంతరం పైకి ఎత్తి కిందపడేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతికి కారణమైన పార్వతి రాజేశం, పార్వతి అనిల్‌ను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ గంగారాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరు..

కాగజ్‌నగర్, మార్చి 22 : కాగజ్‌నగర్ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడిన దుండగుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన జంజీరాల ప్రదీప్ రెండు నెలల్లో మూడు దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇండ్లలో ఎవరూ లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతూ, తప్పించుకొని తిరుగుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాల సాయంతో ప్రదీప్‌ను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగలించిన 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.12 వేలు, సెల్ ఫోన్, కారు స్వాధీనం చేసుకున్నట్లుల వివరించారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

కన్నెపల్లి, మార్చి 22 : భీమిని మండలం వడాల గ్రామంలో జాడి ఈరన్న ఇంట్లో నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే సమాచారం మేరకు ఈరన్న ఇంట్లో సోదాలు చేయగా 40 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు దొరికాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన పుల్లారావు నుంచి ఈ విత్తనాలు తీసుకున్నాడని తెలిపారు. ఈ విత్తనాల విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

రామకృష్ణాపూర్, మార్చి 22 : రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం పలువురు రౌడీ షీటర్లకు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. అలా ఉంటే వారిపై షీట్లు తొలిగిస్తామని తెలిపారు. ఎలాంటి నేరంలో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై జి. రాజశేఖర్ ఉన్నారు.

గూడెం చెక్‌పోస్ట్ తనిఖీ

దండేపల్లి, మార్చి 22 : గూడెం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఏసీపీ ప్రకాశ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు సూచనలు చేశారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తహసినుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కాసిపేట, మార్చి 22 : జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సీఈసీ సెకండియర్ విద్యార్థి గురునాథమ్ శంకర్ గౌడ్ ఎంపికైనట్లు పీడీ బాబు రావు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో గత నెలలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు నాయకత్వం వహించి, ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మణిపూర్‌లో ఏప్రిల్ 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే 68వ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యారిని ప్రిన్సిపాల్ శంకర్, సిబ్బంది, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, డీఐఈవో అభినందించారు. మణిపూర్ వెళ్లేందుకు సరైన రైలు సౌకర్యం లేకపోవడంతో రాష్ట్ర జట్టును విమానంలో పంపించనున్నట్ల, ఈ ఖర్చుల కోసం పలువురు సాయం చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆధీనంలోకి అసైన్డ్ భూమి

తాండూర్, మార్చి 22 : తాండూర్ మండలం అచ్చలాపూర్ శివారులోని సర్వే నంబర్ 1295లో వివాదంలో ఉన్న మూడెకరాల అసైన్డ్ స్థలాన్ని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ స్థలం గతంలో కేశెట్టి మల్లమ్మ (భర్త జానయ్య) పేరిట ప్రభుత్వం నుంచి అసైన్డ్ పట్టా ఇచ్చారు. తర్వాత తమదని రత్నం తార (భర్త పోశం) ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఇరువురు మోకపై గొడవ పడుతూ శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నారు. ఈ విషయంలో తహసీల్దార్, తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల టీమ్ సర్వే మోకపైకి వెళ్లి సర్వే పరిశీలించారు. ఈ స్థలం ప్రభుత్వ అసైన్డ్ అయినందున ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎవరూ ఆ స్థలంలోకి వెళ్లవద్దని తహసీల్దార్ తెలిపారు. గిర్దావార్ ఎజాజుద్దీన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావును కలిసి వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం, టికానంద్, గొడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ పాల్గొన్నారు.

దోషులకు శిక్ష పడేలా చూడాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 22: నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ, లైజనింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని, దోషులకు శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టే బాధ్యత కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమైందన్నారు. ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ అధికారికి పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. హత్య, హత్యాయత్నం, చీటింగ్ కేసుల్లో దోషులకు శిక్ష పడేలా కృషి చేసిన, లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ప్రతిభ చూపిన కోర్టు డ్యూటీ అధికారులకు సీపీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

పోలీసుల కుటుంబాలకు అండగా నిలుస్తాం..

పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమంపై పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని కమిషనర్ అన్నారు. మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కే నాగరాజు గుండెపోటుతో మరణించగా, ఆయన భార్య విజయ కుమారికి రూ. 7,84,762 భద్రతా చెక్కును అందజేశారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంధ్య కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు పెట్టడం సరికాదు

బెజ్జూర్, మార్చి 22 : మండలలోని పాపన్‌పేట గ్రామస్తులను తాగునీటి కోసం అటవీ శాఖ అధికారులు ఇబ్బందులు పెట్టడం సరికాదని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఈ మేరకు శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో అటవీ అధికారులతో రైతుల పాక్షన మాట్లాడారు. ప్రస్తుతం అడుగంటి జలాల నేపథ్యంలో బోర్లు వేయకుండా అంక్షలు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. కనీసం తాగునీటి కోసమైనా అనుమతులు ఇవ్వాలని కోరారు. లేకపోతే ఏప్రిల్ 5న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజ ఆధ్వర్యంలో హెచ్చరించారు. దీనిపై బెజ్జూర్ రెంజ్ అధికారి ముస్సావీర్, కర్జెల్లి రేంజ్ అధికారి ఇక్బాల్ స్పందించారు. అనంతరం రైతులతో కలిసి ఆయన రెంజ్ అధికారులకు మెమోరాండం అందించారు. సీఐలు ముత్యం రమేశ్, శ్రీనివాస్ రావు, రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు ప్రవీన్, రాజు, కొమురయ్య, నరేశ్ రైతులున్నారు. అలాగే మండల కేంద్రంలో పోడు రైతుల సమస్యలపై మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలు అందించారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో దిందా, గంగాపూర్, పాపన్ పేట, మొగవెళ్లి, లుంబీణినగర్, తదితర గ్రామాల్లో గిరిజనేతర రైతులు సాగు కోసం పోడు భూముల్లో వర్షాకాలంలో వేసిన పత్తి కర్రలు తీయకుండా అటవీ అధికారులు అంక్షలు పెట్టడంపై మండిపడ్డారు.

ఎమ్మెల్యేపై అసభ్య పోస్టుపెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

జైపూర్, మార్చి 22 : చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌పై సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టిన బ్యాగరి వెంకటస్వామిపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు శీలం వెంకటేశం, పండుగ రాజన్న శనివారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందుతుంటే పట్టించుకోకుండా కోట్ల రూపాయలతో మంత్రి పదవి తెచ్చుకునేందుకు తిరుగుతున్నావంటూ పోస్టు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బెస్ట్ మోటివేటర్ అవార్డు

వాంకిడి, మార్చి 22 : బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. భూటాన్ దేశంలో శనివారం భారతీయ బౌద్ధ మహాసభ, అంతర్జాతీయ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బుద్ధిస్ట్ కాన్ఫరెన్స్‌లో మాజీ యూజీసీ చైర్మన్ ఎస్‌కే తోరాడ్, భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ అధ్యక్షుడు చంద్రబోది పటేల్, ప్రొఫెసర్ రిక్క అబ్బోత్ ఈ అవార్డును ప్రదానం చేశారు. మారుమూల ప్రాంతాల్లో అంబేద్కర్, బుద్ధుడి ఆశయాలను ప్రచారం చేయడంలో చురుకైన పాత్ర పోషించి నందుకు అశోక్ అవార్డుకు ఎంపికయ్యారు.

పానకల్ వారసంత వేలం

జన్నారం, మార్చి 22 : పానకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు ఎంపీడీవో ఉమర్ షరీఫ్ సమక్షంలో శనివారం కార్యదర్శి రాహుల్ వేలం వేశారు. పానకల్ అక్కపెల్లిగూడకు చెందిన బీనవేణి గంగన్న యాదవ్ రూ.8,05,000 దక్కించుకున్నాడు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సయ్యద్ ఫసిఉల్లా, కంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

హాజీపూర్, మార్చి 22 : మండలస్థాయిలోని భూ సమస్యలను తహసీల్దార్లు పరిష్కరించాలని, అక్కడ కాకపోతే డివిజన్ కార్యాలయానికి పంపించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్‌తో కలిసి డివిజన్‌లోని 11 మంది తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం కోసం మండలాలకు మండలస్థాయి కమిటీలు వేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి, అక్కడిక్కడే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపికచేశారని, ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నదన్నారు.

రక్తదాతలు ముందుకు రావాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 22 : మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిలువల కొరత ఉందని, దాతలు ముందుకు రావాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తెలిపారు. జిల్లా ప్రభుత్వ దవాఖానలో 832 మంది తలసేమియా, సికిల్‌సెల్ చిన్నారులు చికిత్స పొందుతున్నట్లు, అందరికీ 15 నుంచి 20 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్న సందర్భంలో రక్తదాతలు కరువైనట్లు తెలిపారు. గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారని, ప్రస్తుతం మండలాల్లో కూడా తహసీల్దార్ల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించాలని కోరారు. కలెక్టర్ స్పందించి రక్తనిలువలు పెంచాలని కోరారు.

నేడు జాతీయ పురస్కార వేడుక

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 22 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జాతీయ పురస్కార అవార్డుల వేడుక నిర్వహిస్తున్నట్లు సినీ దర్శక నిర్మాత నాగ బాల సురేశ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో శనివారం ఆయన మాట్లాడారు. నవ జ్యోతి సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న డైలాగ్ కింగ్ సాయికుమార్ సినీ జీవితం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఆదివారం కుమ్రం భీం జాతీయ పురస్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసి సాంస్కృతిక పరిషత్, ఓం సాయి తేజ ఆర్ట్స్, నవ జ్యోతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నటుడు సాయికుమార్, మాజీ ఐఏఎస్ పార్థసారథి, హాస్యనటులు బాబు మోహన్, శివారెడ్డి, నిర్మాతలు రాహుల్ యాదవ్, విజయ్ కుమార్ హాజరవుతున్నటుల తెలిపారు. ఆయా సంస్థల సభ్యులు సిడాం అర్జు మాస్టర్, ధర్మపురి వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, అనుమాండ్ల మధు, చంద్రశేఖర్, రాధాకృష్ణ, బాపురావ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

మంచిర్యాల (ఏసీసీ), మార